# అనగనగా... ఒక కథ

జ్యోతి

ప్రపంచంలో ప్రతీ వ్యక్తికీ ఒక ఆల్టర్నేట్ సబ్‌స్టిట్యూట్ ఉంటారు. అంటే ఒక వ్యక్తి దూరమైతే ఆ ఖాళీని పూరించడానికి ఇంకోళ్లు దొరకచ్చు-కానీ అమ్మ-నాన్న? ఎవరూ పూరించలేని గేప్!

**"దేశే దేశే కళత్రాని-దేశే దేశే చ బాంధవాః"**

**దేశదేశాల్లో భార్య లభిస్తుంది-తద్వారా బంధువులూ దొరుకుతారు- (రామాయణంలో రామవాక్యం) కన్నవాళ్లని మాత్రం ఎవరూ భర్తీ చేయలేరు.**

## కొడుకు

* * *

రెణ్నెళ్లుగా ఎదురు ఆఫీసునుంచి ఆవిడ బస్సెక్కేటైముకి అక్కడ నిలబడ్డం- ఆవిడతో మాట్లాడాలనుకోడం- ఆవిడేమంటుందో..'ఛీ' అంటుందో- 'పోరావెధవా' అంటుందో-రంగడికి భయం! మాట పెగల్దు.

ఆవిడ పచ్చగా, దబ్బపండులా వుంటుంది.

తను నల్లగా నేరేడు పండులా వుంటాడు.

పుట్టిన కొత్తలో తనూ నిమ్మపండులా వుండేవాడట.

ఎండలో ఏడిచీ, మురికిలో పెరిగీ, రంగంతా వెలిసీ ఇలా నల్లగా మిగిలాడుట!

ఆవిడని తను ముట్టుకుంటే మాసిపోతుంది అన్నట్లుంటుంది.

ఆవిడ చీర ఖరీదు తన జీవితమంతా కల్సినా చెయ్యదు.

ఇప్పుడు ఆవిడ దగ్గరకెళ్లి.."అమ్మా నేను నీ కొడుకునిట! పేపరు దుకాణం తాత చెప్పాడూ" అంటే నమ్ముతుందా- నమ్మదు. రెండుమూడుసార్లు చెబ్దామని ప్రయత్నం చేసి ప్రయత్నంమీద ధైర్యం చేసి, "అమ్మా.." అనంగానే మాట ఆగిపోయింది. ఆవిడ బిచ్చగాడనుకుని ముఖం పక్కకి తిప్పుకుంది 'వెళ్ల'మన్నట్లు.

మరి రెండ్రోజులు తర్వాత ధైర్యం మళ్లీ కూడదీసుకుని "అమ్మా.." అన్నాడు.

ఆవిడ పరుసులోంచి ఓ కోయన్ తీసి నిర్లక్ష్యంగా విసిరేసి, బస్సు రావడంతో పరిగెట్టుకుని వెళ్లిపోయింది.

"నేను ముష్టాణ్ణి కాదమ్మా" కిందపడ్డ 5 రూపాయల కోయన్ తీసుకుని పరిగెట్టేటప్పటికే ప్రయాణీకులందరూ బస్సు ఎక్కడానికి ఆత్రపడుతున్నారు. ఆవిడ ముందే పరిగెట్టింది గనక వెనకాలగుంపు ఆమెని కప్పేసింది.

రంగడు ఆగిపోయాడు. 5 రూపాయల బిళ్ల చేతిలో బిగిసి వేడెక్కింది.

రాత్రంతా ఎన్నిసార్లు చూసుకున్నాడో ఆ అయిదు రూపాయల కోయన్‌ని.

అది అమ్మ ఇచ్చిన నాణెం. అమ్మ ముట్టుకున్న నాణెం.

కొడుకుకిచ్చిన రెండో కానుక! మొదటి కానుక? జన్మ.

అర్ధరాత్రి వేళ అనిపించింది- రైట్.. రేపు ఈ కోయన్ అమ్మకిచ్చేసి 'నేను ముష్టాణ్ని కాదండీ మీ కొడుకుని' అని ఖచ్చితంగా చెప్పేయచ్చు-ఎటొచ్చీ ఇలా కనిపించకూడదు. కొంచెం శుభ్రంగా, బట్టలు తెల్లగా ఉతుక్కునీ! ఆ రాత్రి అతను నిద్రపోలేదు. చాలా రిహార్సెల్స్ వేసుకున్నాడు.

ఆమె అనే మాటలూ..తను చెప్పే జవాబులూ..వంద రకాలుగా ఊహించుకున్నాడు.

పుట్టిన దగ్గరనుండీ తన కథేంటో తనకీ తెలియదు.

కొంచెం తెల్సి వచ్చాక పేపరు దుకాణం తాతతో కల్సి దుకాణానికి వెళ్లేవాడు. మొదట్లో తాత భుజాల మీద..ఆ తర్వాత తాత సైకిల్ తొక్కుతుంటే హేండిల్ కిందున్న బారు మీద చుట్టిన తువ్వాలుమీద కూచునీ- ఆ తర్వాత వెనక క్యారేజీమీద కూచునీ- ఆ తర్వాత..తాతని తనే వెనకాల కూచోపెట్టుకునీ..ఆ పేపరు దుకాణానికి వచ్చేవాడు.

తాతది పాత పేపర్లు కొని, అమ్మే దుకాణం.

కొన్న పేపర్లు అన్నీ యాజిటీజ్‌గా పేపరుమిల్లుకో, ఇంకో పచారీ దుకాణాలకో అమ్మడు. ఆ పేపర్లు అన్నీ చూస్తాడు. చదవాల్సిన పేపర్లు పక్కన పెట్టుకుని, తతిమ్మావి అమ్మేస్తాడు.

అతనికి ఈ వృత్తి చాలా ఇష్టంగా నచ్చింది. ముఖ్యంగా 'గొప్ప విజ్ఞానాన్ని కేజీల్లో కొనుక్కొని చదివే వృత్తిరా మనదీ' అని పదే పదే చెప్తూ గర్వపడేవాడు.

రంగడికి పుస్తకాలు పేపర్లూ విలువ తెలియనప్పణ్నుంచి అక్షరాలు గుర్తుపట్టటం, చూసిరాయడం, చదవడం.. నేర్పించి, తను ఇంకోళ్లకి అమ్మదల్చుకోని పుస్తకాలు ఎన్నో చూపించి, చదివించీ, అర్థాలు వివరించి, వాటిని ప్రేమించడం నేర్పించేవాడు. పాత చందమామలూ, పెద్ద పెద్ద కవులు రాసిన మంచి మంచి పుస్తకాలూ తాత సేకరణలో వుండేవి.

దుకాణం కట్టేసి ఇద్దరూ ఇంటికెళ్లాక చిన్నప్పణ్నుంచీ ఆ కథలూగట్రా చదివి వినిపించేవాడు. ఆ తర్వాత ఆయనకి చూపు మందగిస్తోందనుకుంటే రంగడు చదివి వినిపించేవాడు.

ఆయన 'వివరిస్తూ' పులకించేవాడు. 17 ఏళ్లు వచ్చాయి రంగడికి- 'ఒరే...నాకెవ్వరు లేరు. నీకూ నేనేమీ ఆస్తిపాస్తులు ఇవ్వలేదు. ఆ దుకాణం నీదే- నేనింక షాపుకి రాలేనేమో' అని ఆయాసంగా చెప్పిన రోజునే సునాయాసంగా చచ్చిపోయాడు.

అయితే ఆయన ప్రాణం పోవటానికి ముందు ఓ కవరు చేతికందించాడు.

అందులో రంగడితల్లి ఫలానా ఆఫీసులో పనిచేస్తుందనీ, ఫలానా టైముకి బస్సు ఎక్కుతుందనీ, ఆవిడ ఆనవాళ్లూ గట్రా బొమ్మగీసినట్లు రాశాడు. ఆవిడని పోల్చుకోవటానికి పెద్ద కష్టపడక్కర్లేదు. ఇతను కూడా చాలాసార్లు చూసినావిడే. ఉత్తరం చదివేటప్పటికి తాతని కుదిపి కుదిపి ఏడిచాడు.

"అసలు అమ్మ నన్నెందుకు వదిలేసింది. నువ్వు నన్నింత ప్రేమగా ఎందుకు చూశావు. నీకూ నాకూ ఈ బంధం ఏమిటి" అని.

అతను పెట్టిన గగ్గోలు ఇంటి పైకప్పునుంచి కిందకి జారి అతనికే వినిపించిందంతే!!

**ఇప్పుడు ఆవిడ దగ్గరకెళ్లి.."అమ్మా నేను నీ కొడుకునిట! పేపరు దుకాణం తాత చెప్పాడూ" అంటే నమ్ముతుందా- నమ్మదు. రెండుమూడుసార్లు చెబ్దామని ప్రయత్నం చేసి ప్రయత్నంమీద ధైర్యం చేసి, "అమ్మా.." అనంగానే మాట ఆగిపోయింది. ఆవిడ బిచ్చగాడనుకుని ముఖం పక్కకి తిప్పుకుంది 'వెళ్ల'మన్నట్లు.**

తాతలేని ఒంటరి బతుకులో మిగిలింది అమ్మ అన్వేషణ!

ఆరోజు రాత్రంతా రంగడు..ఆ ఐదు రూపాయల నాణెంతో బొమ్మాబొరుసూ ఆడుకున్నాడు. అమ్మ నన్ను బిడ్డగా ఒప్పుకుంటుందా లేదా? మొదట్లో రిజల్ట్ బాగా రాలేదు.

"ఒప్పుకోదు"కే ఎక్కువసార్లు వత్తాసుగా బొరుసుపడింది.

ఆఖరిగా..తన వయస్సు పదిహేడు కదా! మెజార్టీయే లెక్కని నమ్మి పదిహేడుసార్లు వేశాడు. ఎట్టకేలకు 'ఒప్పుకుంటుందని' ఆశే గెలిచింది. అప్పట్నించి ఆమెతో మాట్లాడాలని ప్రయత్నం మొదలెట్టాడు.

ఇవ్వాళ ఫైనల్‌గా ఆమె విసిరేసిన అయిదు రూపాయల బిళ్లతో నమ్మకం గెలిచింది.

మర్నాడు పొద్దున్నే లేచి ఓ సోపు, బట్టలసోపు, కొబ్బరినూనీ, దువ్వెనా, పౌడర్‌డబ్బా కొనేశాడు. ఆమె ఇచ్చిన ఐదురూపాయల బిళ్లమాత్రం లక్ష్మీదేవి ఫోటోముందు ఉంచి దణ్ణం పెట్టి దాచుకున్నాడు. బట్టలు తడిపి, ఆరేసి, చెంబుతో ఇస్త్రీ చేసి, అవి తొడుక్కునేటప్పటికి..'అమ్మయ్య' అనిపించింది. తను ముష్టాడు కాదని అమ్మనమ్ముతుంది. తన కొడుకే అని..మనస్సులో మాట పదిమందికీ చెప్తుంది. పగలంతా దుకాణం తెరవకుండా..సాయంత్రం 5.30 కోసం ఎదురుచూసి, బస్టాండుకెళ్లాడు రంగడు.

లక్కీగా ఎక్కువ జనం రాలేదు. అవును ఏమిటీ..ఎవరూ రాలేదు? ఆమె కూడా బైటకి రాలేదు. అవును ఎందుకొస్తుంది..ఆరోజు వాళ్లకి సెలవు. బుధవారం ఆ ఆఫీసుకి సెలవు.

నిజం గమనించేటప్పటికి ఏడయిపోయింది. ఆరోజూ జాగరణ.

మర్నాడు దుకాణం పెంద్రాళే మూసేసి, టిప్‌టాప్‌గా తయారై ఆఫీసు బస్‌స్టాండ్‌లో బస్సెక్కడానికి అన్నట్లు నిలబడ్డాడు.

ఆమె వచ్చింది లోపల్నుంచి. పరిగెడుతూన్న బస్సు కోసం నడక వేగం పెంచి పరిగెట్టింది. కాలికి ఏం తగిలిందో తెలీదుగానీ బోర్లాపడిపోయి..తలకి గట్టిదెబ్బ తగిలి చనిపోయింది.

కొంతసేపు జనాల సానుభూతులు. పంచనామాలు. గంద్రగోళం.

అమ్మని ఆ స్థితిలో రంగడు చూడడు. చూడలేడు. తనకి జవాబు చెప్పే అమ్మకావాలి. కానీ ఇలా? ఆ స్థితిలో ఆమె పూర్తిగా కళ్లబడకుండా మొహం చేతుల్లో కప్పుకుని ఏడుస్తూ వెనక్కివెళ్లిపోయాడు. అమ్మ ఇచ్చిన రెండోశాపం ఆమె మరణం- మొదటిశాపం - పుట్టగానే తనని వదిలెయ్యడం.

* * *

కొన్నేళ్లు గడిచిపోయాయి. రంగడు తాతలాగే పాత పేపర్ల వ్యాపారం చేస్తున్నాడు. బాగానే అభివృద్ధి చేశాడు. అయితే అతను మరిచిపోలేనిది 'అమ్మ'- ఆవిడిచ్చిన అయిదు రూపాయల బిళ్ల అతని దైవం..ప్రాణం..అభివృద్ధికి నిదర్శనం.

రోజూ ఆ నాణేనికి పూజ చేయందే, బొట్టు పెట్టందే బైటకెళ్లడు.

అలాగే బైల్దేరిన ఒకరోజు అతని పేపరు దుకాణానికి ఒక వ్యక్తి 6 కేజీల పేపర్లిచ్చి వెళ్లిపోయాడు.

ఆ పేపర్లు యధావిధిగా చదువుతూన్నప్పుడు దాదాపుగా అరకేజీ బరువున్న పేపర్లు కాని కవరేదో పేపరు మడతల మధ్యలో వుంది. ఎవరో మోసం చేశారు పేపర్లు కొన్న సత్తెయ్యని- తనూ మోసపోయాడు అన్నమాట.

కవరు ఏంటో చూడాలని కుతూహలంతో ఓపెన్ చేశాడు రంగ.

అందులో బోల్డన్ని ఉత్తరాలు! అవి ఒక తల్లి కొడుకుకి రాసిన ఆశీస్సులు. అతని ఆరోగ్యంపట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు!

ప్రతీ అక్షరం ప్రేమామృతంతో తడిసిన అక్షతలే!

ఆ ఉత్తరాలు చదివేక తన తల్లి మౌనభాష కూడా అతనికి గుర్తొచ్చింది.


ఈ అమ్మ ప్రేమని తూకానికి అమ్మిన బిడ్డపై అతనికి కోపం వచ్చింది. కాదు జాలి కలిగింది.

* * *

కె.రాజారావ్..ఫ్లాట్ నెంబర్-505, జనని అపార్ట్‌మెంట్స్...వెతుక్కుంటూ ఆ ఎడ్రస్‌కి వెళ్లాడు.

"మీరు?" అన్నాడు కె.రాజారావ్.

"నా పేరు రంగ. మీకు అమ్మంటే తెలుసా? అమ్మకి ఆల్టర్నేట్ ఇంకెవర్నయినా కనుక్కున్నారా?" ఆత్రంగా అడిగాడు. ఆవేశం కాదు-



"మీరెవరు? మీ మాటలు నాకు అర్థం కావట్లేదు" అన్నాడు రాజారావు.

"మీ అమ్మరాసిన ఉత్తరాలు. కోట్ల విలువ చేసే అక్షింతలు తూకానికి అమ్మేసిన మీకు, అంతటి వ్యక్తి దొరికిందా అని తెలుసుకుందామని వచ్చాను" అంటూ ఉత్తరాల కవరు అతనికి అందించాడు రంగ.

ఆ కవర్ని పోల్చుకున్న రాజారావ్ కళ్లు ఎర్రబారాయి. విస్ఫులింగాల్లా నీళ్లుదొర్లాయి.

"ఒక్క నిముషం" అని లోపలికి వెళ్లాడు.

చెంప ఛెళ్ళుమన్న చప్పుడు. ఆ తర్వాత వినిపిస్తున్న మాటలూ రంగా చెవులకి సోకుతున్నాయి.

"నువ్..అమ్మ చీరలు పనిమనిషికి ఇచ్చేస్తే నేను కాదన్లేదు. ఆవిడ పడుకున్న మంచం వాచ్‌మేన్‌కి ఇచ్చేస్తే కాదన్లేదు. ఆవిడ వంటిమీద బంగారం దాచుకుని, ఆవిడ రాసిన ఉత్తరాలు అవతల పడేస్తావా? తూకానికి అమ్మేస్తావా?" అతని కోపంలోంచి ఏడుపూ దానితో గళం కలిపిన ఆమె ఏడుపూ- వినలేకపోతున్నాడు రంగా. "మా అమ్మరాసిన ఉత్తరాల్లో ఉన్న అక్షరాలు నాకొక్కడికే కాదే...నీకు- నీ సౌభాగ్యానికి.."

రంగ ఇంకేం వినకుండా వెనక్కి మళ్లిపోయాడు.

*